గుర్తు

శ్రీమతి ఆర్. వసుంధర

వంకాయరంగు ఖరీదైనది ఎరుపురంగు వెంకటగిరి జరీ చీరె, అదేరంగు లిప్‌స్టిక్ గోళ్లరంగూ, కెంపులూ ముత్యాలూ కలిసిన సొమ్ములూ, మాక్స్ ఫాక్టర్ మేకప్—ఆడంబరం లేకుండా ప్రత్యేకంగా కనిపిస్తోంది కళావతి. అప్పటికంటె బహుకొద్దిగా లావైనా, అప్పటి 'బాపూ బొమ్మ' రూపం మారలేదు. పదిహేనేళ్లక్రితం తామిద్దరూ కలసి చదువుకున్నప్పటికంటే కొద్దిగా తెల్లబడటం, మొహం కొంచెం కోలగా తీరటం తప్పించి కళావతిలో మార్పు కనిపించలేదు నళినికి. అప్పటిలాగే ప్రతి చిన్న విషయం గురించి శ్రద్ధ తీసుకుని తనకు ముఖ్యమైన అభిరుచుల్ని అలాగే నిలుపుకున్నదన్న మాట!

విశాఖలో చదువుకొంటున్నప్పుడు కాలెజ్‌కి బస్సువెళ్లే దోవ చాలా అందంగా ఉండేది. నీలమైన ఆకాశంక్రింద ఈ ప్రక్కా ఆ ప్రక్కా నల్లటి కొండలు. కొండలమధ్యన ఎగుడు దిగుడుగా మెలికలు తిరుగుతూపోయే రోడ్డు. చల్లని సముద్రపు ఉప్పు గాలికి ఒళ్లంతా బంకా, తడీ. ఎంత దూరం పోయినా అదే అందం. ప్రకృతిలోని ఆనందంలోకి ప్రయాణం అది.

ఈ కొండమీదొకటీ ఆ కొండమీదొకటీ బంగళాలుండేవి.........కొండ ఒంపుల్లో ఒదిగి, ఎత్తుమీద ఒంటరిగా, విశిష్టంగా, అందంగా,ఆనందంగా. ఒక దానిపేరు డవ్స్‌నెస్ట్. ఇంకో దానిపేరు పిజన్స్‌నెస్ట్.

బస్సులోని రణగొణ ధ్వనితో సంబంధంలేకుండా బయటకు చూస్తూ ప్రక్కప్రక్కనే కూర్చునే వాళ్లు తామిద్దరూ సాధారణంగా.

'పెళ్లయ్యాక నేను ఆ డవ్స్‌నెస్ట్‌లోవుండే మేనేజరుగారి భార్యలా ఉంటాను నళినీ' అన్నది కళావతి ఒకసారి.

ఆ మేనేజరుగారి భార్య చాల అందంగా ఉండేది. అందమైన ఎంబ్రాయిడరీలు, పెయింటింగ్ చేసేది. ఒకసారి మాకు అందమైన డిన్నర్ యిచ్చింది. ముచ్చటైన పిల్లలిద్దరున్నారు ఆమెకు.

కళావతి మాటలతో యీ లోకంలోకి వచ్చింది నళిని.

'ఇంతసేపట్నుంచీ ఇదా నీవు ఆలోచిస్తున్నది! ఎప్పుడూ నీకు ఎలా వుంటే బాగుంటుందన్న ఆలోచనే' అన్నది నవ్వుతూ కించిత్తు విసుగుతో.

కళావతి యిదే విషయాన్ని రెండు మూడు సార్లు చెప్పింది తరువాత. తాను ఎలా ఉండాలో, ఎలా కన్పించాలో, ఎలా డ్రెస్ చేసుకుని ఎలామాట్లాడి ఎలా మాట్లాడి ఎలాంటి అభిప్రాయం ఎదుటి వాళ్లలో కలిగించాలో కళావతికి స్పష్టంగా తెలుసు. సినిమాకు వెళ్లాలన్నా షికారు వెళ్లాలన్నా రోజూవెళ్లే కాలేజికి వెళ్లాలన్నా ఏ విధంగా ముస్తాబుకావాలో నిశ్చయించుకొని ఆ ముస్తాబులోని అన్నిభాగాలూ అనుకున్నట్లుగా పూర్తి చేసుకోవడానికి గంటపట్టేది కళావతికి. నళినికి అలాంటి శ్రద్ధలేదు. ఫలానావిధంగా కన్పించాలన్నా నిర్దిష్టమైన అభిప్రాయం ఉండేదికాదు. అలాంటి ఊహాచిత్రం కలిగి ఉండటం హాస్యాస్పదం అనుకునేది. అది మనసులోని శూన్యతకు పరిమితత్వానికి చిహ్నం అనిపించేది...కాని చిత్రమేమిటంటే కళావతి కాల గమనంతో మారకుండా విరుగు తరుగులు లేకుండా చెక్కుచెదరకుండా ఉండిపోయింది. అనుకున్న దాన్ని సాధించగలిగింది. డబ్బుగల భర్త, ఇద్దరు ముచ్చట

గొలిపేపిల్లలూ, కారూ, మేడా, ఆల్సేషియన్ కుక్కా... చిత్రంలోని భాగాలన్నీ యథార్థాలై నిలిచాయి.

నళిని భర్తకు ట్రాన్స్‌ఫర్అయి వారం రోజుల క్రితం ఆ పట్టణానికి వచ్చారు. ఒక పెద్దమేడలో ఒక భాగం అద్దెకు తీసుకున్నారు. మిగతా ఇంట్లో సొంత దారులే ఉంటున్నారు. ఇంటి వెనుక భాగంలో పని మనిషి పనిచేసే కొళాయీ, వెనుక తోటా రెండు భాగాలకూ కలిసి వున్నవి. ఆ ఇంట్లో చేరిన మూడో రోజు సాయంత్రం వెనుక భాగంలో నిలుచున్న నళినిని చూచి గుర్తించి ఆనందంతో పలకరించింది కళావతి. ఆమే ఇంటి యజమానురాలు. ఏమీ తోచనప్పుడు 'తోడు'కోసరం అద్దెకిచ్చారట మా భాగం ఇల్లు. 'అద్దెకివ్వటం'కూడా కళాత్మకంగా ఉండొచ్చు!

పదిహేనేళ్లక్రితం ఇద్దరూ మంచి స్నేహితులు. సాహిత్యంలోని అభిరుచివలన దగ్గరై, చదువుకున్న మూడేళ్లూ కలిసి ఉన్నారు.

ఇన్నేళ్ల తర్వాత కళావతితో పోల్చి చూసుకున్న నళినికి కించిత్తు న్యూనతా భావం కలిగింది. తనకీ కళావతికీ ఎంత భేదం! నాజూకైన తన శరీరం లావై ఆకృతిని కోల్పోయింది. తనకూ డబ్బూ కారూ కావలసినవన్నీ ఉన్నాయి. కాని అవి కళావతికిలాగా తనకు తృప్తినివ్వలేక పోతున్నాయి. ఉండీ లేనివై పోతున్నాయి. ప్రతివిషయాన్నీ అల్పమని త్రోసిపుచ్చే మనసు ఏ పనినీ సరిగా చేయనివ్వదు. ఇల్లు శుభ్రంగాసర్దుతూ 'శుభ్రతలో ఏమున్న'దనుకొంటుంది. వంటచేస్తూనే 'ఆ, పాడు తిండి' అనుకొంటుంది. ఫలితంగా ఇల్లూ వంట రూపము — ఏదైనాగాని అనుకున్నట్లుగా కళాత్మకంగా దిద్దుకోలేని నిస్పత్తువ ఆవరించింది. ప్రాణసములనుకున్న భర్తా పిల్లలూ దగ్గరఉండీ దూరంగా ఉన్నట్లు కన్పిస్తున్నారు. భార్యగా తల్లిగా నిర్వర్తించవలసిన బాధ్యతలు ఒక మూసలో కట్టివేసి ఇరుకున పెడుతున్నట్లున్నాయి. కాలం అంతా గడచిపోయినట్లు, భవిష్యత్తు అనేది లేనట్లు, తాను చెయ్యవలసినదని ఏమీ మిగలనట్లు మనసులో శూన్యత నిండిపోయింది. తాను ఏమి సాధించింది? దేన్ని నిలుపుకున్నది? దేన్ని నమ్మింది? ఎటుచూసినా సమాధానంలేని ప్రశ్నలు. కారణం తెలియని నిర్వేదం.

కొమ్మ చివర్న విచ్చిన ఎర్రగులాబీ పువ్వులాగా అందంగా నిలుచుని ఉన్నది కళావతి.

'నిన్నుగురించి నేను ఎన్నోసార్లు అనుకున్నాను నళినీ...అప్పటిలాగే ఉన్నావో, ఏమైనా మారి పోయావోనని...కొద్దిగా, చాలా కొద్దిగా లావయ్యావు...' కళావతి కళ్లు నళినిని ఆప్యాయంగా తడిమాయి.

నళినికి చీకాకు కలిగింది.

'కొద్దిగా ఏమిటే...చాలా లావయ్యాను' అన్నది.

కళావతి నవ్వింది, చిన్న వెండిగంట మ్రోగినట్లుగా.

ఆ నవ్వుచూచి నళినికి మరింత చీకాకు వేసింది. అంతలోనే తమాయించుకొని 'కళావతిని చూసి నేను అసూయ పడుతున్నానా? ఎందుకు?' అనుకుంది. పదిహేనేళ్ల క్రితం ఎలా ఉన్నదో యిప్పుడూ అలానేఉన్నది కళావతి. అప్పుడు కళావతిని చూచి అసూయ చెందకపోగా విసుక్కున్నది. అల్పమైన విషయాలకు అతిముఖ్యమైనట్లు విలువ నిస్తుందనీ లోతులేనివ్యక్తిఅనీ అనుకున్నది. ఇప్పుడు ఆ అల్పమైన విలువలుకూడా తనకు లేనందుకు నిస్పృహ కలుగుతోంది. ఆమార్పు కళావతిలో వచ్చిందికాదు. తనలో కలిగినదే! అప్పుడు తనకు నిండుదనాన్నీ సంతృప్తినీ విశిష్టతనూ ప్రసాదించిన కారణం యిప్పుడు లుప్తమై కనుమరుగై పోయిన కారణం...అదేమిటి?

కొంచెంసేపు అలానే నిల్చుండిపోయింది నళిని: మనసు గతంలోనికి వెళ్లిపోయింది. క్రమంగా అనాటి రూపం ధరించింది.. నాన్నగారు, అమ్మ, చెల్లెళ్లు — ముఖ్యంగా నాన్నగారు—తప్పొప్పులకూ మంచి చెడ్డలకూ అతీతంగా, ఒకానొక దివ్యమైన ప్రేమ భావంలో, అది ప్రసాదించే ఆనందంలో, అందరు ఒకటిగా...ఆ తృప్తిలో తనొక విశిష్టమైనదాన్నన్న అహంకారం, మిగతా అన్నివిషయాలూ అల్పమైనవన్న నిరసన...ఏదైనా చెయ్యాలి, సాధించాలన్న అవసరంలేదు. ఏ బాధ్యతాలేదు...'నేను' ఉండటమే ఆనందం... జీవితం అనేదీ దానికి సంబంధించిన విలువలూ అన్నీ నిస్సారంగా, పరిమితమైనవిగా తోచాయి. ఆ ఆనందం, ఏకత్వం అనేవి సత్యమూ శాశ్వతమూ అవునా? అన్న ప్రశ్న తోచలేదు. అసలు ఏ సందేహానికీ అవసరం కలుగలేదు అప్పుడు...

ఇద్దరూ అలా నిలుచునిఉండగానే పనిమనిషి వచ్చింది. రెండు స్టీలుగిన్నెలు ఒకే ఆకారంలో ఉండేవి పట్టుకొచ్చింది. ఒకటి రెండోదానికంటే కొద్దిగా పెద్దది.

'అమ్మా, వీటిలో ఒక గిన్నె మనదీ, యింకోటి మూడోయింటివాళ్ళదీను. అన్నం తీసుకుపొయ్యాను. రెండూ కలిసిపోయినై, గుర్తుల్లేవు. మనదేదో తీసుకోండి' అన్నది.

నళిని రెండు గిన్నెల్నీ చూచింది. రెండూ ఒకటిగానే కనిపించాయి. తనదేదో గుర్తించలేక పోయింది.

'మావి పదేళ్ళక్రిందటకొన్న బరువుగిన్నెలు,' అంటూ రెంటినీ చేతిలోకి తీసుకుని చూచింది. రెండూ బరువుగానే వున్నై. కొంచెం ఎక్కువ బరువుగావున్న పెద్దగిన్నెను చేతబట్టుకొని 'ఇదే ఉండొచ్చు' అన్నది.

'నిన్న పనిమనిషి కడుగుతూంటే మీ గిన్నెలు చూశాను, నళినీ. ఆ చిన్నది మీది...నీ చేతిలో ఉండేది కాదు' అన్నది కళావతి మెల్లగా, నాజూగ్గా.

నళిని మరోమాటు గిన్నెల్ని చూచింది. ఆ చిన్నగిన్నె మరీ చిన్నదిగా తమది కానట్టుగా కనిపించింది.

'మాది అంత చిన్నగిన్నెకాదే' అన్నది.

'అవును, నళినీ' అన్నది కళావతి సుతారంగా.

నళినికి కోపం వచ్చింది. 'నా వస్తువుల సంగతి నాకంటే తనకే ఎక్కువ తెలుసు ననుకుంటుం దేవిటి! నేను బి. ఏ లో ఫస్ట్‌క్లాస్; తాను థర్డ్‌క్లాస్' అనుకుంది. ఎట్లైనా ఏది ఏ గిన్నో కనిపెట్టాలి, తన తెలివితేటల్ని తన అస్తిత్వాన్ని నిరూపించుకోవాలన్న ప్రయత్నంలో గిన్నెల్ని పరిశీలనగా చూసింది. రెండూ శుభ్రంగా తళతళా మెరుస్తూ కనిపించాయి

మరింత తీక్షణంగా చూసింది నళిని రెండూ మరింత తళతళా మెరిశాయి. చూచినకొద్దీ పరిమాణంలోని భేదంకూడా మరుగునపడిపోయి రెండూ విడివిడిగా కాకుండా ఒకటిగా ఒకే మెరుపుతో ధగధగలాడాయి...అంతా అపరిమితమైన అనంతమైన తళతళ్లాడే స్టీలు...

నళిని మనసు శూన్యం అయిపోయింది.

తళతళ...మిలమిల...మిలతళ...తళతళ...

ఏ గిన్నె అయితేనేం? అనిపించింది.

'మా గిన్నెలన్నీ ఒక సెట్టులోనివి. ఒకదానిలో ఒకటి సరిగ్గా ఇముడుతాయి'అంటూ రెండు గిన్నెల్నీ లోనికి తీసుకువెళ్లి పరీక్షించింది! చిన్నగిన్నే తనది. కళావతి చెప్పిందే నిజం.

పెద్దగిన్నె తెచ్చి ఇచ్చివేసింది. వాళ్లిద్దరి మొహాల్లోనూ నవ్వు కనిపించింది. 'సొంతగిన్నెను గుర్తించుకోలేని వెర్రితనం చూడు' అన్నట్టుంది ఆ నవ్వు.

కాని నళినికి అదేమీ పట్టలేదు. ఇందాకట్నుండీ మనసును ఆక్రమించుకొన్న ఆలోచన సాగి మళ్లీ ఆ రోజు గుర్తుకొచ్చింది...దూరాన ఎక్కడో నాన్నగారు పోయారు. ఆయన ప్రాణవాయువులు అనంతవాయువులో కలసిపోతుంటే, అంతటి వాత్సల్యానికిమూలంగా తోచిన ఆ శరీరం అగ్నికాహుతియై నశించిపోతుంటే, అదేమీ ఎరక్కుండా హాయిగా స్నేహితులతో కాలం గడిపింది! దివ్యంగా భాసించిన ఆ ప్రేమ మండి బూడిదైపోతుంటే తన కెందుకు తెలియలేదు? తెలియకపోవడం ఎలా సంభవం? ఏ కొంచెంగానైనా తెలిసిందేమో, ఏ సూచనైనా అందిందేమోనని ఆనాటి సంఘటనల్ని ఎన్నోసార్లు తరచితరచి చూచుకున్నది.

ఎంతగా పరిశీలించినా ఏమీ కనిపించలేదు. 'ఆ ప్రేమకు అస్తిత్వంలేదు. ఉంటే యిలా జరుగదు! అశాశ్వతమైనదాన్ని శాశ్వతం అనుకున్నాను. పరిమితమైనదానికి అపరిమితత్వాన్ని ఆపాదించుకున్నాను. ఎందుకో వుత్తభ్రమలో పడిపోయాను' అనుకున్నది. ప్రపంచం శూన్యంగాతోచి నిస్పృహ కలిగింది...

...కాని, తన అనుభవం...అప్పుడు తనలో నిలిచిన నమ్మకం...అవి ఎక్కణ్ణుంచీ వచ్చాయి? అవి నిజం కాదా?...అంతా అయోమయం అయిపోయింది నళినికి...

"ఈ సారి గిన్నెలన్నిటిమీదా పేరు వేయించాలి' అన్నది ప్రకాశంగా.

పేర్లతో ఏర్పడి పేర్లు నిండిన ప్రపంచంలో పేరు లేనిది ఉంటుందా? ఉంటే గుర్తించటం సాధ్యమా?